వైభవంగా భీమేశ్వర స్వామి తెప్ప ఉత్సవం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి తెప్ప ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన హంస వాహనంపై భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఇక్కడ గల సప్త గోదావరి నదిలో విహరింపజేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ టి.తారకేశ్వరరావు పర్యవేక్షించారు.

గోదావరిలో తెప్ప ఉత్సవం

బటన్ నొక్కారు సరే.. సొమ్ములేవీ..?

- ఆసరా కోసం మహిళల ఎదురు చూపులు
- 4వ విడత నిధుల విడుదలలో జాప్యం
- అధికారుల చుట్టూ డ్వాక్రా సభ్యుల ప్రదక్షిణలు

గత నెల 23న మహిళా సంఘాలకు చెక్కు పంపిణీ చేసిన మంత్రి విశ్వరూప్, కలెక్టర్

ప్రజాశక్తి- రాజోలు

గత నెల 23న నాలుగో విడత ఆసరా సొమ్ములు విడుదల చేసేందుకు సభ పెట్టి సిఎం వైఎస్.జగన్ బటన్ నొక్కారు. ఇప్పటికీ ఒక్క గ్రూపునకు కూడా సొమ్ము పడితే ఒట్టు.. సార్ బటన్ అయితే నొక్కారు. సొమ్ములు ఎప్పుడు పడతాయో అని లబ్ధిదారులు ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. బటన్ నొక్కి నెలవుతున్నా.. పథకం డబ్బులు లబ్ధిదారుల ఖాతాలకు చేరడం లేదు. ఆసరా నాలుగో విడత సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ చేసేందుకు గత నెలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. ఇంకా సగం మందికిపైగా డబ్బులు జమ కాలేదు. మండలాల్లో పంపిణీ సభలు జరిగిన వెంటనే అయా మండలాల పరిధిలోని సంఘాల సభ్యుల్లో ఆసరా పథకానికి అర్హులైనవారి బ్యాంకు ఖాతాకు నిధులు జమవుతాయనే అధికారుల మాటలు కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. క్షేత్ర స్థాయిలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటోంది. ఈ లబ్ధికోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సివస్తోందని అక్కాచెల్లెమ్మలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆసరా కోసం మహిళల ఎదురు చూపులు..!

నవరత్నాలు పథకాల్లో భాగంగా మహిళా సంఘాలకు నాలుగో విడత ఆసరా సొమ్ము పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిని గత నెల 23న అనంతపురం జిల్లా ఉరవకొండలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లాంఛనంగా ప్రారంభించారు. ఆ తరువాత ప్రతి నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఈ కార్యక్రమాన్ని సభలు పెట్టి తాము సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పథకాలు నిలుపుదల చేయకుండా ప్రజలకు అందించిన ఘనత కేవలం ముఖ్యమంత్రి జగన్, వైసిపి ప్రభుత్వానికి సాధ్యం అంటూ ఊకదంపుడు ప్రసంగాలు చేశారని, డబ్బులు మాత్రం జమ చేయలేకపోయారని మహిళలు అంటున్నారు. ప్రతి మండలంలో స్వయం సహాయక సంఘాలకు జమయ్యే ఆసరా మొత్తానికి నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమం నిర్వహించిన మరుసటిరోజు నుంచే మహిళల బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ కావాల్సి ఉంది. కానీ నేటికీ అధిక శాతం మందికి ఎదురుచూపులు తప్పడం లేదని వాపోతున్నారు

జిల్లాకు రూ.254.24 కోట్ల నిధులు

అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 31,093 స్వయం సహాయక సంఘాలకు రూ.254.24 కోట్ల ఆసరా నిధులు జమ కావాల్సి ఉంది. ఇప్పటికే అన్ని జిల్లాల్లోనూ సభల నిర్వహణ పూర్తయ్యింది. అయినా సగం గ్రూపులకు డబ్బులు జమ కాలేదు. ఇప్పటి వరకూ అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు, రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో రూ.115.85 కోట్లు మహిళా సంఘాల ఖాతాలో జమయ్యాయి. మిగిలిన సంఘాల మహిళలు తమ బ్యాంకు ఖాతాల్లో ఆసరా సొమ్ము జమయ్యాయేమోనని నిత్యం బ్యాంకులకు వెళ్లి ఆరా తీయడం, అక్కడి సిబ్బంది రాలేదని చెప్పడం.. నిరాశగా వెనుదిరగడం జరుగుతోందని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడో విడతలో అయితే సామాజిక వర్గాలవారీగా నిధులు జమ చేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని అధికారులంటున్నారు. గ్రూపులకు నేరుగా మొత్తం సొమ్ము జమైన తరువాత మహిళల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని పేర్కొంటున్నారు.

బటన్ నొక్కే అన్ని పథకాలదీ ఇదే పరిస్థితి..!

సిఎం వైఎస్.జగన్ బటన్ ఎప్పుడు నొక్కినా..ఆ నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో చేరేందుకు సమయం పడుతూ వస్తోంది. ఒక్కోసారి రెండు నెలలు పట్టిన సందర్భాలు ఉన్నాయి. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేదోడు.. ఇలా పథకం ఏదైనా.. లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు పడేందుకు సమయం పడుతోంది. ఒక్కోసారి రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఆయా పథకాలకు అవసరమైన నిధులు లేకపోయినప్పటికీ సిఎం బటన్ నొక్కేస్తున్నారు. అటువంటి సందర్భాల్లో మరింత జాప్యం జరుగుతోంది. సిఎం బటన్ నొక్కిన తరువాత ఒకరి ఖాతాలో జమ అయ్యి, మరొకరి ఖాతాలో జమ కాక పోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన పెరుగుతోంది. గ్రామ స్థాయిలో ఉండే సచివాలయ సిబ్బంది, సదరు శాఖల సహాయకులను లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్ష

ప్రజాశక్తి-మండపేట, కాట్రేనికోన, రామచంద్రాపురం

రామచంద్రపురంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

మండపేట పట్టణంలో ఆదిత్య, విజ్ఞాన్ కళాశాలతో పాటు స్థానిక మారేడుబాక రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్-2 పరీక్ష ఆదివారం పకడ్బందీగా నిర్వహించారు. ఈ పరీక్షకు 850 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 181 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 669 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ఈ పరీక్ష మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక ఆదిత్య కాలేజీ వద్ద పట్టణ ఎస్ఐ హరికోటి శాస్త్రి తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. రామచంద్రపురం డిఎల్‌డిఒ శాంతి, తహశీల్దారు సురేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ బి.రాము, ఎంపిడిఒ కె.శ్రీదేవి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు.

కాట్రేనికోన మండల పరిధిలోని చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా సాగింది. మొత్తం 500 మంది అభ్యర్థులకు గాను 469 మంది పరీక్షలు రాశారు. 31 మంది పరీక్షకు గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రావు తెలిపారు. విద్యార్థులకు తాగునీరు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాట్రేనికోన ఎస్ఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

రామచంద్రాపురం పట్టణంలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్‌డిఒ సుధాసాగర్ తెలిపారు. కిట్స్ కాలేజీలో 250 మంది అభ్యర్థులు పరీక్ష రాయవలసి ఉండగా 185 మంది హాజరయ్యారని, బిఎస్ఎన్ కాలేజీలో 750 మంది అభ్యర్థులకు 616 మంది హాజరయ్యారని, గరికపాటి రుద్రయ్య చౌదరి ఇంటర్ కాలేజీలో 400 మందికి 330 మంది పరీక్ష రాశారని, మోడరన్ డిగ్రీ కాలేజీలో 300 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 268 మంది హాజరైనట్లు ఆర్‌డిఒ వివరించారు.

పేదలకు ఇళ్ల స్థలాల ఘనత వైసిపిదే

ప్రజాశక్తి - అంబాజీపేట

ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎంఎల్ఎ చిట్టిబాబు

ప్రతి పేదవానికీ నివేశ స్థలాలు అందించిన ఘనత సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో తహశీల్దారు జె.కమలకుమారి అధ్యక్షతన ఆదివారం 1,220 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థల హక్కుల పత్రాలను ఎంఎల్ఎ అందజేశారు. పి.గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలో 2,236 మంది లబ్ధిదారులకు ఇంటి స్థల హక్కు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి బూడిద వరలక్ష్మి, పికె.రావు, సొసైటీ చైర్‌పర్సన్ డి.సత్యమోహన్, వైస్ ఎంపిపిలు ఎన్.నాగరాజు, ఎస్.లక్ష్మీభార్గవి, ఎఎంసి వైస్ చైర్మన్ ఎన్.నాగరాజు, వైసిపి మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, మద్దింశెట్టి మల్లిబాబు, చప్పిడి రాజు పాల్గొన్నారు.

జెడ్‌పి మాజీ చైర్మన్ నామనకు సతీ వియోగం

ప్రజాశక్తి -మామిడికుదురు

జెడ్‌పి మాజీ చైర్మన్ నామన రాంబాబు సతీమణి కృష్ణవేణి (62) ఆదివారం హైదరాబాద్ యశోద హాస్పటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె కుమారుడు వినోద్ అమెరికాలో కార్డియాలజిస్ట్, కుమార్తె తిరుమల సీతా మహాలక్ష్మి ఉన్నారు. ఆమె పార్థివ దేహాన్ని స్వగ్రామం మామిడికుదురు. మండలం తీసుకువచ్చారు. ఆమె మృతి పట్ల మాజీ సిఎం చంద్రబాబు, మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, టిడిపి జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి ఫోన్‌లో మాట్లాడారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు.

ఆసీల నుంచి మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం ఛాంబర్ అధ్యక్షుడు బోనం సత్య వరప్రసాద్ అధ్వర్యంలో ఛాంబర్ సభ్యులు ఆదివారం మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌ను కలిసి ఆసీలుపై మినహాఇంపు ఇవ్వాలని కోరారు. అమలాపురం పురపాలక సంఘం వేలం పాటల నోటిఫికేషన్‌లో రోడ్డు మార్జిన్‌ల నుండి రోజువారి వ్యాపారం చేసుకునే వారికి మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి అన్ని లైసెన్సులూ తీసుకుని మున్సిపల్ టాక్స్, సెంట్రల్ జిఎస్‌టి, స్టేట్ జిఎస్‌టి, ఐజిఎస్‌టి, ఫుడ్ లైసెన్స్, లేబర్ లైసెన్స్, వెయిట్ అండ్ మెజర్మెంట్స్, ఇన్‌కంటాక్స్, సేల్స్ టాక్స్, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ ఇతర పన్నులు, చెత్త పన్ను సహా చెల్లించి వ్యాపారం చేసుకుంటున్నారని చెప్పారు కానీ ఆసీలుదారులు గెజట్ ప్రకారం రోడ్డు మార్జిన్‌లో రోజువారి వ్యాపారాలు చేసుకునే వారి నుంచి ఆసీలు వసూలు చేసుకొనుటకు వేలంపాట పాడుకున్నారని, కానీ అన్ని లైసెన్సులు కలిగిన వ్యాపారస్తులు వ్యాపార నిమిత్తం లారీల నుండి దిగుమతులు చేసుకొను సమయంలో ఆసీలు కట్టాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. లేని యెడల సరుకులు దిగుమతిని నిలిపివేస్తున్నారని చెప్పారు. లైసెన్స్‌లు కలిగి వ్యాపారం చేసుకునే వారిని మినహాయించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ప్రధాన కార్యదర్శి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, కిరాణా వర్తక సంఘం కొవ్వూరు శ్రీనివాస్ రెడ్డి, కంచిపల్లి అబ్బులు, రేపాక వెంకన్నబాబు, అధికారి వెంకటేశ్వరరావు, మేడిచర్ల త్రిమూర్తులు, చింతలపూడి సత్తిబాబు, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరావు, రాయుడు నాని, వలవల శివరావు, కట్టొజు సుబ్బారావు, అనుపోజు శ్రీను, ద్వారంపూడి సత్య నారాయణ రెడ్డి పాల్గొన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ ఆసీలు సమస్యను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని సానుకూలంగా స్పందించారు.

వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారస్తులు

నేడు యథావిధిగా స్పందన

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమం యథావిధిగా సాగుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు కోరాలని ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సాయం అందిస్తున్న మందపల్లి తదితరులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక అరుంధతిపేటకు చెందిన పలివెల కుమార్ ఇటీవల మరణించారు. ఆయన కుటుంబానికి మందపల్లి సోదరులు ఆర్థిక సాయం చేసి బాసటగా నిలిచారు. కుమార్ భార్య కరిమున్నీసాకు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, మందపల్లి సుధాకర్, మందపల్లి సంజీవరావు, రూ.6 వేలు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొల్లి సత్యనారాయణ, దార్ల అబ్రహాం, కొడమంచిలి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

యువతతో మాట్లాడుతున్న జనసేన నేత రాపాక రమేష్

యువతతో టీ విత్ డాక్టర్ రాపాక

ప్రజాశక్తి -మామిడికుదురు

కరవాకలో ఆదివారం అగ్నికుల క్షత్రియ యువతతో జనసేన పార్టీ నాయకుడు డాక్టర్ రాపాక రమేష్ బాబు టీ విత్ రాపాక కార్యక్రమం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర మత్స్యకార విభాగ సెక్రెటరీ పొన్నాల ప్రభ, పార్టీ సఖినేటిపల్లి మండల అధ్యక్షులు గుబ్బల ఫణికుమార్, మండల కార్యదర్శి బొమ్మిడి ఏడుకొండలు, జనసేన నాయకులు ఉండపల్లి అంజి, రేకపల్లి కృష్ణాజీ, గొల్లపాలెం గ్రామశాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, గొంది గ్రామశాఖ అధ్యక్షుడు కొల్లు వెంకటరాజు, రాపాక మహేష్, కొల్లాటి శ్రీనుబాబు, కొల్లు దుర్గాప్రసాద్, శ్రీహరి, పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ నాగేంద్ర మణి

అమలాపురం స్థానిక రెండో వార్డ్‌లో డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో కౌన్సిలర్ ఆశెట్టి నాగ దుర్గ ఆదిబాబు నేతృతంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్-2024 పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ పోటీలను అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్రమణి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో స్థానిక కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లాడ శరత్‌బాబు, డాక్టర్ గంధం విశ్వనాథ్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎనుముల కృష్ణ పద్మరాజు, సెక్రెటరీ వంటెద్దు వెంకన్న నాయుడు, ఏడిది శీను, దొమ్మేటి వెంకటరమణ, నగబేరి కృష్ణమూర్తి, కల్వకోలను బాబీ, చిక్కం రాజబాబు, నార్ని శ్రీను పాల్గొన్నారు. అనంతరం మహిళా భాగంలో పోటీలు ప్రారంభమయ్యాయి. 66 కేజీల విభాగంలో జి.సుభద్ర మలికిపురం, యు.శశికళ అమలాపురం, ఎం.దుర్గ అమలాపురం, 66 కేజీలు పైబడిన విభాగంలో ఎం.శ్రేయ, తణుకు, పి.వందన, అమలాపురం, సిహెచ్.హారిక, రామచంద్రపురం వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుచుకున్నారు. స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్ ఎం.శ్రేయ, తణుకు, స్ట్రాంగ్ ఉమెన్ రన్నర్ పి.వందన, అమలాపురం. గెలుచుకున్నారు. న్యాయనిర్ణేతలుగా డివివి సత్యనారాయణ, దొమ్మేటి వెంకటరమణ, ఎంవి.సముద్రం, యు.లక్ష్మీనారాయణ, కె.బాలకృష్ణ వ్యవహరించారు. మొత్తం 96 మంది పాల్గొన్న ఈ పోటీల్లో తొమ్మిది భాగాలుగా ఈ పోటీల్లో జరుగుతున్నాయని కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు.

చెల్లుబోయిన శ్రీనుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - అంబాజీపేట

శ్రీనివాసరావును సత్కరిస్తున్న వైసిపి నాయకులు

ఎన్నికల పరిశీలకునిగా నియమితులైన చెల్లుబోయిన శ్రీనివాసరావును వైసిపి శ్రేణులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఎం వైఎస్.జగన్ వినీతికి తావు లేకుండా సచివాలయాలు, వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. వైసిపి అంబాజీపేట మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో చెల్లుబోయినకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. తనను పరిశీలకునిగా నియమించిన సిఎం వైఎస్.జగన్, రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్ రెడ్డి, మంత్రి విశ్వరూప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల నాయకులు ప్రజలను కలుపుకుని పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. అనంతరం మంత్రి విశ్వరూప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి బూడిద వరలక్ష్మి, దొమ్మేటి సత్యమోహన్, ఎం.ప్రశాంత్, ఎంఎం.శెట్టి, కాంద్రేగుల గోపాలకృష్ణ, దొంగ రత్నం, మద్దింశెట్టి మల్లిబాబు, చప్పిడి రాజు, ఎస్.రాము, వి.శ్రీనివాసరావు, మట్టపర్తి హరి పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మండపేట

ఆర్థిక సాయం అందిస్తున్న సాయిబాబు తదితరులు

స్థానిక విద్యావికాస్ కాలేజ్‌లో ఇంటర్మీడియట్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం ఆర్థిక సాయం అందించారు. ఎంపిసిలో 1000కి 985 మార్కులు సాదించిన పామర్తి శ్యామల దేవికి, బైసిపిలో 1000కి 984 మార్కులు సాధించిన ఎన్.లక్ష్మీదీపికకు లయన్స్ క్లబ్ మండపేట ఆధ్వర్యంలో పట్టణ ప్రముఖులు జిన్నూరి సత్య సాయిబాబు పుట్టినరోజు సందర్భంగా ఒకొక్కరికీ రూ.10,000 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని, ప్రతి విద్యార్థి ప్రభుత్వం దాతలు అందిస్తున్న సౌకర్యాలు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఈ కార్ర్యమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ చెన్నా రాంబాబు, లైన్స్ ప్రతినిధులు లక్ష్మీ నాగేంద్రబాబు, గుండు తాతరాజు, వర్రే సత్యన్నారాయణ మూర్తి పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో బండారు కుటుంబం

వెంకన్నను దర్శించిన బండారు కుటుంబం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు వేంకటేశ్వర స్వామిని టిడిపి ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు సత్యానందరావు తన కుటుంబ సభ్యులతో ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 29 నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు వచ్చేవారికి 5 రోజుల పాటు నిర్వహించనున్న అన్నదానంలో పాల్గొనే సుమారు 15 వేల మందికి చేసే సేవలో భాగంగా 800 లీటర్ల పెరుగు, 20 వేల మంచినీళ్ళ ప్యాకెట్లను ఆయన అందించారు.

బిసి హోదాను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-అమలాపురం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో శెట్టిబలిజలు కోల్పోయిన బిసి హోదాను పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షులు గుత్తుల మీరా కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నర్సాపురం ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణంరాజును హైదరాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేశామని శెట్టిబలిజ యువ నేత వాసంశెట్టి సుభాష్ తెలిపారు. తెలంగాణలో శెట్టిబలిజలు కోల్పోయిన బిసి హోదాను పునరుద్ధరించేలా కృషి చేస్తానని ఎంపీ రఘురామ్‌కష్ణంరాజు హామీ ఇచ్చారని తెలిపారు. కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, కెఎస్.మూర్తి, ఉపాధ్యక్షులు మామిడిశెట్టి నాగేంద్ర పాల్గొన్నారు.

కొత్తపేట సీటుపై పునరాలోచించాలి

ప్రజాశక్తి-రావులపాలెం

రాష్ట్రంలోనే జనసేన పార్టీకి కంచుకోటలాగా ఉన్న కొత్తపేటలో అసెంబ్లీ సీటును జనసేన పార్టీకి కేటాయించేలా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పునరాలోచించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం రావులపాలెంలోని కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వహించారు. కొత్తపేట సీటును టిడిపికి కేటాయించడాన్ని పలువురు కార్యకర్తలు వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా సమావేశం రెండు గ్రూపులుగా విడిపోయింది. ఓవైపు బండారు శ్రీను అభిమానులు, మరోవైపు పవన్ కళ్యాణ్ అభిమానులు నినాదాలు చేయడంతో బండారు శ్రీనివాస్ కలుగజేసుకుని సముదాయించారు. ఈ విషయమై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. మరి కొంతకాలం వేచి చూసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.

కార్టూన్ 'నిజం'



సీతారామరాజు పార్కు ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

పార్కును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

ఆత్రేయపురంలో రూ.కోటీ 50 లక్షలతో అభివృద్ధి చేసిన అల్లూరి సీతారామరాజు పార్కును ఆచంట ఎంఎల్ఎ, చెరుకువాడ శ్రీరంగనాధరాజు, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డితో కలిసి ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆత్రేయపురం పూతరేకులకు పుట్టినిల్లు అయిన గ్రామంలో మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు పేరు మీద పార్కును అభివృద్ధి చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం కుమ్మరిపేటలో ఏర్పాటు చేసిన సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బోనం సాయిబాబా, ఆప్కాబ్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపిపి కుండా అన్నపూర్ణ, మాజీ జెడ్‌పిటిసి చిలువూరి రామకృష్ణంరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముదునూరి రామరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడులు

ప్రజాశక్తి-కాట్రేనికోన

కోడిపందేలే నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. కాట్రేనికోన పంచాయితీ పరిధిలోని చెంచుల గురువు వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేశారు. ఆరుగురు వ్యక్తులతో పాటు రెండు కోళ్లు, ఆరు కత్తులు, రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

రహస్య ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందేల ప్రాంతంలోనే ఇరు వర్గాల మధ్య కోడిపందేల విషయమై ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కొట్లాటకు దిగడంతో బడుగు సతీష్ అనే వ్యక్తికి నడుముపై గాయాలయ్యాయి. కొంతమంది యువకులు గాయపడిన సతీష్‌ను ముమ్మిడివరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి వైద్యం చేయించారు. ఈ ఘర్షణ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు తమకు అందలేదని ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని బాలాంత్రం గ్రామంలో శనివారం రాత్రి మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేశారు. ఇద్దరు యువకులు నలుపు రంగు పల్సర్ వాహనంపై వచ్చి బాలాంతరం గ్రామంలో రోడ్డు పక్కన కిరాణా షాప్ పెట్టుకుని జీవిస్తున్న మహిళ మెడ నుండి రెండున్నర కాసుల బంగారు గొలుసు దొంగిలించుకుని యానాం వైపుగా పరారయ్యారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్టు ఎస్ఐ జానీ బాషా తెలిపారు.

సూర్య ప్రకాష్‌ను సన్మానిస్తున్న సర్పంచులు, ఎంపిటిసిలు

పిల్లి సూర్య ప్రకాష్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలం సర్పంచ్‌లు ఎన్నికై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి సూర్య ప్రకాష్‌తో కేక్ కట్ చేయించారు. అనంతరం వారు సూర్య ప్రకాష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దూడల నాగేశ్వరరావు, సర్పంచులు తోకల శ్రీనివాస్, పిల్లి రాంబాబు, చెల్లి నాగేశ్వరరావు, పలువురు ఎంపిటిసిలు, మండల నాయకులు పాల్గొన్నారు. తనను సన్మానించిన సర్పంచులకు సూర్య ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపి జెండాకు అవమానంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వైసిపి జెండాకు అవమానం జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఇది. ఎస్ఐ కెఎం జోషి కథనం ప్రకారం కిత్తనచెరువు పంచాయతీ సీతారామపురం మెయిన్ రోడ్డులో వైసిపి స్థూపంపై ఉన్న పార్టీ జెండాను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విరగొట్టి పక్కనే వంట కాలువలో పడవేశారంటూ వైసిపి నాయకుడు చిల్లా లక్ష్మణ రావు తమకు ఫిర్యాదు చేశాడన్నారు. ఇటీవలే పార్టీ స్థూపాన్ని ఏర్పాటు చేసి జెండాను ఆవిష్కరించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

'అభివృద్ధికీ అరాచకానికి మధ్య పోటీ'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు, పెత్తందారులకు మధ్య పోటీ జరుగుతుంటే.. రాజమండ్రిలో మాత్రం అభివృద్ధికీ, అరాచకానికీ మధ్య పోటీ జరుగుతోందని వైసిపి సిటీ కో-ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. 47వ వార్డులో వైసిపి యువజన విభాగం నగర అధ్యక్షుడు పీతా రామకృష్ణ ఆధ్వర్యంలో 200 మంది వైసిపిలో చేరారు. టివి రోడ్డు వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎంపీగా ఎన్నికైన తరువాత చేసిన అభివృద్ధిని చూడాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా జరగనంత అభివృద్ధి చేసి చూపించానన్నారు. నాలుగు దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న టిడిపి నేతలు, ఒకే కుటుంబానికి చెందిన మేయర్, ఎంఎల్ఎ, ఎంఎల్‌సిలు ఏం చేశారని ప్రశ్నించారు. రాజకీయ ముసుగులో సామాన్యులను వడ్డీ వ్యాపారం పేరుతో పీడించుకుని వారి ఆస్తులు కబ్జా చేయడం, ముక్కు పిండి చక్ర వడ్డీలు..బారు వడ్డీలు వసూలు చేయడం చాలా నేరమన్నారు. ఇటువంటి వారు రాజకీయాల్లోకి రానీయకూడదన్నారు. ప్రజలు ఓటు వేసే ముందు ఒక్క క్షణం ముందు ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో చోడిశెట్టి సత్యవేణి, తిరగాటి దుర్గ, గుడాల ఆదిలక్ష్మి, గుడాల ప్రసాద్, పాస్టర్ ప్రవీణ్ కుమార్, రేగుల్ల బాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - గోపాలపురం

తాడేపల్లిగూడెంలో ఈ నెల 28న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ నాయకులు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు నాయకులు, కార్యర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం గోపాలపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వమించారు. సువర్ణరాజు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం సభను విజయవంతం చేయాలన్నారు. జగన్ అరాచకపాలనకు స్వస్తి పలికేందుకు జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా కష్టపడి పనిచేయాలన్నారు. జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి, జనసేనలను గెలిపించాలన్నారు. కూటమిగా మొదటి సారిగా తాడేపల్లిగూడెంలో జరగబోయే ఈ బహిరంగ సభను వియవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.రాజేంద్ర, కె.గణేష్, డి.నరసింహామూర్తి, సిహెచ్.బాపిరాజు, పి.గణపతి, రాంలీల, సూర్యభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు

ప్రజాశక్తితో డిఐఒ రత్నకుమార్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జాతీయ ఇమ్యూనైజేషన్ దినోత్సవం సందర్భంగా వచ్చే నెల మూడో తేదీన నేషనల్ పల్స్ పోలియో డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాకినాడ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.రత్నకుమార్ తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలని ఆయన సూచించారు. పోలియో చుక్కల కార్యక్రమానికి యాక్షన్ ప్లాన్‌ను ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే సిబ్బందికి రెండు విడతలగా శిక్షణ కూడా అందించామన్నారు. జిల్లాలో ఇమ్యూనైజేషన్‌కు సంబంధించి ఆయన పలు అంశాలను ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ఎంతమందికి పోలియో చుక్కలు వేయనున్నారు.?

జిల్లాలో రూరల్ ఏరియాలో 15,33,399 మంది జనాభా పరిధిలో 1,19,012 మంది చిన్నారులకు, అర్బన్ ఏరియాలో 6,10,577 మంది జనాభా పరిధిలో 64,709 మంది పిల్లలకు మొత్తంగా 21,43,976 మంది జనాభా పరిధిలో 1,83,721 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

హైరిక్స్ ప్రాంతాలు ఎన్ని.?

జిల్లాలో 358 ప్రాంతాలను హైరిస్కు ప్రాంతాలుగా గుర్తించాం. 17,784 మంది పిల్లలు ఈ ప్రాంతాల పరిధిలో ఉన్నారు. వీరిలో రూరల్ ఏరియాలో 6,732 మంది, అర్బన్ ఏరియాలో 11,052 మంది ఉన్నారు.

ఎన్ని బూత్‌లను ఏర్పాటు చేశారు.?

మొత్తం 1319 బూత్‌లను ఏర్పాటు చేసాం. 125 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో 2,638 బృందాల్లో 5,276 మంది సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు. 55 బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ముగ్గురు సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో 220 మంది సిబ్బంది పోలియో చుక్కలు వేయనున్నారు. హోప్ ఐలాండ్‌లో సుమారు 30 మంది పిల్లలు ఉన్నారు. పోర్ట్

అధికారి అనుమతితో అక్కడ పిల్లలకు కూడా చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేశాం.

పిల్లలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

విద్యార్థులు వేళకు ఆహారం తినేలా, కంటి నిండా నిద్ర పోయేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలి. ఇతర విద్యార్థులతో పోల్చి హేళనగా మాట్లాడటం వంటివి చేయరాదు. వారి మనసు గాయపరిచేలా మాట్లాడటం వంటివి చేయరాదు. పిల్లల్లో ఆత్మస్థయిర్యాన్ని నింపాలి. వారిపై ఒత్తిడి పెంచరాదు. పరీక్షల సమయంలో పిల్లలతో తల్లిదండ్రులు తరచూ మాట్లాడాలి. చదువుపై ఏకాగ్రత కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆరోగ్యం బాగుంటేనే విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించగలరు.

వికలాంగ ఓటర్లకు వీల్‌చైర్ల అందజేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

వికలాంగ ఓటర్లకు ఉపయోగించేందుకు 8 వీల్‌చైర్‌లను ఎన్నికల అధికారి, ఆర్‌డిఒ సుధాసాగర్‌కు ఆదివారం మోడరన్ విద్యాసంస్థల ద్వారా అందజేశారు. ప్రముఖవిద్యావేత్త డాక్టర్ గరిగిపాటి రుద్రయ్య చౌదరి వర్థంతి సందర్భంగా మోడరన్ ఫౌండేషన్ ద్వారా సీనియర్ సిటిజన్స్, ప్రత్యేక అవసరాలు గల ఓటర్ల సౌకర్యర్థం ఉపయెగించే నిమిత్తం వీటిని అందజేశామని విద్యాసంస్థల అధినేత జివి.రావు తెలిపారు. కళాశాల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎస్.సుధాసాగర్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులుకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ సామాజిక సేవా రంగాల్లో మోడరన్ ఫౌండేషన్ చేస్తున్న కృషికి రుద్రయ్య చౌదరి భావజాలమే స్ఫూర్తి అని వివరించారు. ఆర్‌డిఒ సుధాసాగర్ మాట్లాడుతూ దేశానికి వెన్నెముక వంటి ఎన్నికల్లో అవసరార్థులైన ఓటర్లకు ఉపయోగపడేలా జివి.రావు వీల్‌ఛైర్స్ అందజేయడం అభినందనీయమన్నారు. విద్యా రంగంలోనే కాక, సామాజిక సేవారంగంలో కూడా రావు చురుకైన పాత్ర పోషించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారని కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పరిపూర్ణమైన ఆశయంతో చేసే సేవ పదిమందికి ఆలంబనంగా నిలవడంతో పాటు మరింతమంది సేవా భావంతో ముందుకు వచ్చేలా చేస్తుందని, అటువంటి వారిలో జివి.రావు ఒకరని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోడరన్ స్టాఫ్ పాల్గొన్నారు.

వీల్‌చైర్లు అందజేస్తున్న జివి రావు

ఏడిద రోడ్డులో పగలే వెలుగుతున్న వీధిలైటు

పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు

ప్రజాశక్తి-మండపేట

విద్యుత్ వినియోగాన్ని తగ్గించి, నాణ్యమైన వెలుగులు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎల్ఇడి వీధి దీపాలను ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా వీధి దీపాలు, రాత్రీ పగలూ తేడా లేకుండా వెలుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. అనేక సమయాల్లో రాత్రీ పగలూ తేడాలేకుండా విద్యుత్ దీపాలు వెలగడంతో విద్యుత్ బిల్లులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. నిత్యం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏదో ఒక ప్రాంతంలో ఈ వీధి దీపాలు ఇలాగే వెలుగుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. మండపేట ఏడిద రోడ్డులో కొన్ని లైట్లు పగలు వెలుగుతుండగా మరికొన్ని లైట్లు మరికొన్ని రాత్రులు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు.

వాడపల్లి ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్వామివారి పుష్కరిణి నాలుగు వైపులా రూ.40 లక్షలతో చేపట్టే విద్యుత్ దీపాల ఏర్పాటు పనులకు, ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ షర్మిళారెడ్డి, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ వేంకటేశ్వరుని ఆలయ రూపురేఖలు సమూలంగా మర్చివేయడానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి కేంద్రప్రభుత్వ ప్రసాద్ స్కీమ్ ద్వారా రూ.50 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపించినట్టు చెప్పారు. కేంద్రప్రభుత్వ బృందం ఆలయాన్ని సందర్శించి నివేదిక సమర్పించిందన్నారు. వీరికి ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, డిసి కిషోర్ కుమార్ అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి

ఏడిద రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలు

రోడ్డు వెంబడి బొండాల వ్యర్థాలు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణంలో కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న వ్యాపారులు వాటి వ్యర్థాలను తీసుకువచ్చి ఏడిద రోడ్డు చెంతనే పడవేస్తున్నారు. ఈ వ్యర్థాలు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమిస్తూ ఉండడంతో ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వాహనాలు ఎదురైనప్పుడు వాటిని తప్పించుకునే ప్రయత్నంలో ఈ బొండాలపై జారి పడుతున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలి

ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి-పి.గన్నవరం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్ కుమార్తె ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. ముంగండ గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి నూతన ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఆదివారం ఆమె పాల్గొనానరు. మాజీ ఎంపిపి అంబటి భూలక్ష్మి కోటేశ్వరరావు, ఆలయ నిర్వాహక కమిటీ ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనతంర కవిత మాట్లాడుతూ బ్రిటిష్ వారి ముందు తలవంచకుండా ఆంధ్ర పౌరుషాన్ని చాటిచెప్పిన దశాబ్దాల చరిత్ర గల గ్రామం ముంగండ అన్నారు. ఎపి రవాణాశాఖ మంత్రి విశ్వరూప్, జెడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మానేపల్లి అయ్యాజీ వేమా, ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ కుసుమ చంద్రకళ వెంకటేశ్వరరావు, పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎంఎల్‌సి కవిత

ఆలయ అధికారులు చెక్కు అందజేస్తున్న దాతలు

అర్చకుల వసతి గృహాలకు విరాళం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మాణం తలపెట్టిన అర్చకులు వసతి గృహాలకు అమలాపురానికి చెందిన పాబోలు వెంకట నర్సింహారావు (రాజా) సుభద్రా దేవి దంపతులు 50వేల రూపాయల చెక్ ను ఆలయ ఛైర్ పర్సన్ దూడల వీరీతదేవికు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు ఎండూరి నాగేశ్వరరావు, పట్టణ వైస్సార్సీపీ యువత అధ్యక్షులు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

చర్చిలపై దాడులు ఆపాలి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని వద్దిపర్రులో దగ్ధమైన చర్చిని ఆదివారం బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి కాంద్రేగుల నరసింహమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చిని తగలబెట్టడం చాలా దారుణమైన సంఘటన అన్నారు. ప్రభుత్వం చర్చిని తగలబెట్టిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కూలీలను పరామర్శించిన సంజీవ్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని సంధిపూడికి చెందిన జంగం సత్తిపండు, తాడి చక్రవర్తి పొలంలో పనిచేస్తుండగా ఆదివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి హుటాహుటిన స్థానికులు తరలించారు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ఆసుపత్రికి పంపించవలసిందిగా వైద్య సిబ్బందికి సూచించారు.

అస్వస్థతకు గురైన వారిని పరామర్శిస్తున్న సంజీవ్

సొంత నిధులతో తాగునీటి పైపులైన్

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని ఆవుపాడు గ్రామం, కొత్తపేట కాలనీలో ప్రజలకు తాగునీటిని అందించేందుకు సర్పంచ్ అచ్యుతసత్యనారాయణ తన సొంత నిధులతో బోరు తవ్వించి పైపులైను వేయించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బోరు వేయించానని ఆయన తెలిపారు. కొంతమంది సహకరించనందున పైప్ లైన్ నిర్మించేందుకు రెండేళ్లు పట్టిందన్నారు. ఎండాకాలం దృష్ట్యా ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో రెండు కిలోమీటర్ల మేర పైపులైను వేయించి ఆదివారం ప్రారంభించారు.

రెండో రోజుకు సూర్యచంద్ర దీక్ష

ప్రజాశక్తి-గోకవరం

పొత్తులో భాగంగా సీటు రాకపోవడాన్ని నిరసిస్తూ జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాటంశెట్టి సూర్యచంద్ర చేస్తున్న నిరవధిక దీఓ రెండో రోజుకు చేరకుంది. నాలుగు మండలాల జనసైనికులు దీక్షా శిబిరం వద్దకు చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా పాటంశెట్టి మాట్లాడారు. పొత్తు ధర్మానికి ఇప్పటికే కట్టుబడే ఉన్నానని, తనకు జరిగిన అన్యాయానికి తన ఆత్మహత్యే పరిష్కారమనానరు. సాధారణ ప్రజలు రాజకీయాల్లోకి ఎప్పటికీ దూరమే అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పినట్లు డబ్బులు లేని రాజకీయాలకు ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కూడా కట్టుబడి లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎగా పోటీ చేయాలంటే కనీసం రూ.100 కోట్లు అయినా ఖర్చు చేయగలగాలన్నారు. దీనిపై జనసైనికులు స్పందిస్తూ, నిత్యం ప్రజల్లో తిరిగే సూర్యచంద్రకు మొండి చేయి చూపించడం తగదన్నారు. 48 గంటల్లో అధిష్టానం నుంచి స్పందన రాకపోతే తమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. జనసేన రాష్ట్ర నాయకులు దోసపాటి సుబ్బారావు, గోకవరం మండల జనసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, గోకవరం టౌన్ అధ్యక్షులు పదిలం మురళి, గండేపల్లి మండల అధ్యక్షులు గోన శివరామకృష్ణ, జగ్గంపేట మహిళా అధ్యక్షులు నక్కపల్లి భవాని, జగ్గంపేట మండల అధ్యక్షులు మెరిసే రామకష్ణ గవిని దుర్గాప్రసాద్, జనసేన వీర మహిళ ఎస్ నాగదేవి పాల్గొన్నారు.

యానాం వార్తలు

ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి కుమార్, ఎంఎల్ఎ అశోక్, మల్లాడి

యానాంలో జిప్‌మర్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

జవహర్ లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్మెర్) మల్టీ స్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్‌ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ పద్ధతిలో ఆదివారం ప్రారంభించారు. పుదుచ్చేరి జిప్మర్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ఎన్ దొరై రాజన్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి వ్యవసాయ శాఖ మంత్రి డిజె కుమార్, స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖలో ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన జిప్మెర్ సంస్థ వైద్య సేవలు ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిప్మర్ ఆసుపత్రితోపాటు, మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ యానాం జిప్మెర్ ఆసుపత్రి ఏర్పాటుకు కేంద్రప్రభుత్వానికి అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించానని తెలిపారు. ఆసుపత్రి అవసరాన్ని వివరించడంతో నిధులు మంజూరు చేసి త్వరితగతిన నిర్మానాన్ని పూర్తి చేశారన్నారు. సభకు అధ్యక్షత వహించిన పుదుచ్చేరి జిప్మర్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ఎన్ దొరై రాజన్ మాట్లాడుతూ రూ.48.83 కోట్ల నిధులతో జిప్మెర్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఈ ఆసుపత్రి వల్ల యానాంతోపాటు తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, ప్రాణాంతక వ్యాధుల వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చుచేయడంతోపాటు వందలాది కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి తప్పుతుందని అన్నారు. జిప్మర్ ఆసుపత్రిలో గుండె, కేన్సర్, ఊపిరితిత్తులు, కాలేయం తదితర దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, మెడికల్ ఆఫీసర్ దిలీప్‌కుమార్ మౌర్య, జిప్మర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైస్ మిల్స్ వర్కర్స్ నూతన కార్యవర్గ ప్రతినిధులు, కార్మికులు

రైస్ మిల్ వర్కర్స్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - యానాం

యానాం రైస్ మిల్స్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక రాజీవ్ గాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని అన్నారు. ఢిల్లీ కేంద్రంగా రైతాంగం చేస్తున్న పోరాటాన్ని మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా అణిచివేతకు పాల్పడుతుందని తెలిపారు. కార్మికులంతా ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నికైంది. యూనియన్ గౌరవ అధ్యక్షులుగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, అధ్యక్షులుగా సబ్బతి రాంబాబు, కార్యదర్శిగా తిరుకోటి శ్రీను, ఉపాధ్యక్షులుగా పిల్లి నూకరాజు, వై.అప్పారావు, సహాయ కార్యదర్శులుగా వాకలపల్లి వెంకటేశ్వరరావు, గుత్తాల బాలరాజు, కోశాధికారిగా వాసంశెట్టి అర్జున్‌రావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

వైసిపి హయాంలో జనరంజక పాలన

ప్రజాశక్తి - గోపాలపురం

వైసిపి ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తోందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న కృషి చేస్తున్నారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఆదివారం వేళ్లచింతలగూడేనికి చెందిన 144 మందిని ఇళ్ల పట్టాలను అందించారు. సర్పంచ్ గోళ్ల దండియ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులు ఇంకా ఎవరైనా ఉంటే వారికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామన్నారు. జగనన్న కాలనీల నిర్మాణంతో ఊళ్లకు ఊళ్లు ఏర్పడుతున్నాయన్నారు. ఇళ్లు లేని పేదలు ఎవరూ ఉండకూడదని ఇప్పటికే 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రాకముందు 25 లక్షల మందికి ఇళ్లు ఇస్తామని చెప్పినప్పటికీ.. మ్యానిఫెస్టోలో చెప్పిన దానికంటే మిన్నగా అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, యండపల్లి శేఖర్‌బాబు, వెలగా శ్రీరామ్మూర్తి, ఎంపిటిసి సభ్యులు కొండయ్య, యండపల్లి కవిత, అన్సర్ భాషా, పంచాయతీ సెక్రెటరీ సాంబమూర్తి, డిటి కృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి- గోకవరం

మండల కేంద్రమైన గోకవరం ఊరకాలువ గట్టుపై 1వ సచివాలయం పరిధిలో రూ.27లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం గల జలజీవన్ మిషన్ నిధులుతో మంచినీటి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సర్పంచ్ కొమరం శ్రావణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోకవరం సొసైటీ అధ్యక్షులు దాసరి చినబాబు, గోకవరం మండల సచివాలయల కన్వీనర్ దాసర రమేష్, వైసీపీ నాయకులు సుంకర వీరబాబు, సుంకర రమణ, దాసరి సతీష్ నపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు పులపర్తి బుజ్జి, చింతల అనిల్, మెహర్‌బాబా, తోలేటి రాంప్రసాద్, దాసరి చినసతీష్, బదిరెడ్డి రాంబాబు, సురేష్, జెసి హరిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. తంటికొండ దళిత కాలనీలో మంచినీటి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సర్పంచ్ బదిరెడ్డి సత్యనారాయణమ్మ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అధ్యక్షులు దాసర చినబాబు, సుంకర వీరబాబు, సుంకర రమణ, బదిరెడ్డి సుబ్బయ్య, బదిరెడ్డి అప్పన్న దొర, దేవస్థాన ఛైర్మన్ బడిరెడ్డి రాంబాబు, వైస్ ఎంపిపి మడికి మైనర్‌బాబు, బదిరెడ్డి నాగ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి : ఎంపీ భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తాను చేసిన అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో ఎంఎల్ఎగా ఆశీర్వదించాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రజలను కోరారు. ఆయన ఆదివారం 21వ వార్డులో పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. తనను ఎంఎల్ఎగా గెలిపిస్తే నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. నగరంలో 24 గంటలూ మంచినీటి సరఫరా సదుపాయం కల్పిస్తానని హామీ ఇచ్చారు. మెప్మా సభ్యులు నిర్వహిస్తున్న ఆహా క్యాంటీన్‌ను ఆయన సందర్శించి వ్యాపారంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అజ్జరపు వాసు, ఎవి.రమణ, కె. శేషయ్య, హుండాయ్ రాజు, పి.నాగు, కె.ఈశ్వర్ పాల్గొన్నారు.